క్లుప్తంగా

ఉపాధ్యాయులు నైపుణ్యం పెంచుకోవాలి


శిక్షణకు హాజరైన సింగరేణి ఉపాధ్యాయులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గండా శ్రీనివాస్ అన్నారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇల్లెందు క్లబ్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం సింగరేణి పాఠశాలల ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరయ్యారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు, పీవీకే – 5 గని మేనేజర్ డాక్టర్ శ్యామ్, డీవైపీఎం ఎం.రాజేష్, డాక్టర్ ప్రభుదయాళ్, ఎస్వై.కాంతారావు పాల్గొన్నారు.

పుస్తకాలే విజ్ఞాన సంపద


పుస్తకాలు అందజేస్తున్న మహమూద్ పాషా

ఇల్లెందు: పుస్తకాలు మానవాళికి విజ్ఞాన సంపద అని తెలంగాణ స్టేట్ గ్రీన్ రేంజర్ కోఆర్డినేటర్ ప్రధానోపాధ్యాయుడు షేక్ మహమూద్ పాషా అన్నారు. ఆదివారం ఇల్లెందు శాఖ గ్రంథాలయానికి పెద్ద సంఖ్యలో ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాస పుస్తకాలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. లైబ్రేరియన్ రుక్మిణీ, సాధిక్‌పాషా పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

పాల్వంచ: ఫుట్‌పాత్‌లపై నిద్రించే అభాగ్యులకు స్టార్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలితీవ్రత పెరుగుతుండటంతో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం, ఇతర పలు చోట్ల ఫుట్‌పాత్‌లపై ఉన్న వారికి ప్రముఖ వైద్యులు సోమరాజు దొర, నామా బుచ్చయ్యల చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎస్‌కే.చాంద్, ఉపాధ్యక్షుడు బోడెపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పోరాటం


మాట్లాడుతున్న రజాక్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేస్తుందని కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్ అన్నారు. ఆదివారం జరిగిన యూనియన్ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్మికుల అనుమతితోనే సభ్యత్వ నమోదు చేపట్టడం జరిగిందన్నారు. కల్లబొల్లి మాటలతో అనేక హామీలు ఇచ్చి గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ ఇప్పటికైనా కార్మికుల పక్షాన ఉండాలని సూచించారు. కార్మిక పక్షపాతిగా పనిచేస్తున్న ఐఎన్‌టీయూసీపై విమర్శలు మానుకుని కార్మిక సంక్షేమం కోసం పనిచేయాలని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కార్పొరేట్ స్ట్రక్చర్ మీటింగ్‌లో గుర్తింపు సంఘం ఏ ఒక్క హక్కును కూడా యాజమాన్యాన్ని ఒప్పించకపోవడంపై కార్మికవర్గం అసహనం వ్యక్తం చేస్తోందన్నారు.

జీఓ నంబర్ 3కు చట్టబద్ధత కల్పించండి..


సమావేశమైన తుడుందెబ్బ కమిటీ సభ్యులు

ఇల్లెందు: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు సుప్రీంకోర్టులో వేసిన కేసు పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని, జీఓ నంబర్ 3 చట్టబద్ధత కల్పించాలని తుడుందెబ్బ జాతీయ కమిటీ సమావేశంలో కన్వీనర్ కల్తీ వీరస్వామి కోరారు. ఆదివారం ఇల్లెందులో తుడుందెబ్బ జాతీయ కమిటీ సమావేశం పెన్షనర్ భవన్‌లో జరిగింది. వీరస్వామితో పాటు కోకన్వీనర్ కల్తీ సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్, ఏఈడబ్ల్యూసీఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి బుగ్గ రామనాథం మాట్లాడుతూ.. పోడు భూములకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని కోరారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏజెన్సీలో ఆదివాసీలకే ఇవ్వాలన్నారు. గొగ్గెల రామస్వామి, జార కృష్ణ, ఈసం వెంకటేశ్వర్లు, తాటి మధు, పడిగ నాగేశ్వరరావు, తాటి కృష్ణ పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- ఆటలకు నోచుకోని క్రీడా ప్రాంగణాలు
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు
- నిరుత్సాహంలో గ్రామీణ క్రీడాకారులు



సుజాతనగర్ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

సుజాతనగర్: గత ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు పూర్తయినా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో గ్రామీణ క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి మట్టిలోని మాణిక్యాలను వెలికితీసే ఉద్దేశంతో గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలోనూ క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేసింది. పట్టణాలకు తీసిపోని విధంగా పల్లెలను తీర్చిదిద్ది శాశ్వత వనరులను సమకూర్చింది. సుజాతనగర్ మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో.. దాదాపు ప్రతీ గ్రామ పంచాయతీలో ఓ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణ లేక క్రీడాకారులు నిరాశ చెందుతున్నారు.

నిర్వహణ లోపం..

ప్రతీ గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా చాలాచోట్ల వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రతీ క్రీడా ప్రాంగణం చుట్టూ హరిత హారం కింద మొక్కలు నాటాలి.. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులు ఏర్పాటు చేయాలి.

వ్యాయామానికి లాంగ్ జంప్ సింగిల్, డబుల్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా వాటిని నిర్మించలేదు. మండలంలో చాలావరకు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పాఠశాల ఆవరణల్లో నిర్మించారు. దీంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. దీనికి తోడు క్రీడా ప్రాంగణాలు పూర్తి వినియోగంలో లేక క్రీడాకారులు నిరుత్సాహ పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల్లోనూ ఆటలు లేవు..

కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆటలు కూడా ఆడించడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ప్రైవేటు పాఠశాలలు క్రీడా ప్రాంగణాలు లేకుండానే కొనసాగుతున్నాయి. క్రీడలు మానసిక ఉల్లాసం పెంపొందిస్తాయని ప్రముఖులు చెబుతున్నా వాటిని పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.


హైస్కూల్‌లో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

ఉపాధ్యాయులను కేటాయించాలి..



ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు వినియోగంలోకి తీసుకురావాలి. గ్రామీణ ప్రాంతాల్లో సరైన మైదానాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో విశేష ప్రతిభ దాగుంది. ప్రతీ క్రీడా ప్రాంగణానికి ఓ క్రీడా ఉపాధ్యాయుడిని కేటాయించాలి. గ్రామాల్లో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– ఉడుగుల శ్రీకాంత్, వేపలగడ్డ

ఏళ్లుగా నిరీక్షణ..



గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించాలని గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసింది. నేడు అవి నిరుపయోగంగా మారాయి. గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాలి.. ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నా క్రీడాకారులకు ప్రోత్సాహం అందడం లేదు. ఉన్నతాధికారులు చొరవ చూపి గ్రామీణ క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి.

– మాలోత్ రాములు, గరీభ్‌పేట

మున్నూరు కాపులకు అన్యాయం జరుగుతోంది..


మాట్లాడుతున్న కాంపెల్లి కనకేష్

పాల్వంచ: కులానికి సబంధం లేని కొందరు దొడ్డిదారిన మున్నూరు కాపు కుల ధృవీకరణ పత్రాలు పొందుతున్నారని, అసలైన మున్నూరు కాపులకు అన్యాయం జరుగుతోందని మున్నూరు కాపు పటేల్స్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్ అన్నారు. ఆదివారం స్థానిక వర్తక సంఘ భవన్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కనకేష్ మాట్లాడుతూ... ఆంధ్రా ప్రాంతానికి చెందిన కొందరు తూర్పు కాపులు, నాగేశపోల్లు కలిసి పట్టణ మున్నూరుకాపు సంఘం అని రిజిస్ట్రేషన్ చేయించుకుని తప్పుడు కుల సర్టిఫికెట్లు పొందుతున్నారన్నారు. నిజమైన కాపులు తహసీల్ చుట్టూ తిరిగినా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, డబ్బులు ఇస్తే అనర్హులకు ఎలాంటి విచారణ చేయకుండా ఇస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే కమిటీలు వేస్తామన్నారు. కార్యక్రమంలో చింత నాగరాజు, ఆకుల ఆనంద్, మిరియాల కమలాకర్, మద్దుల వీరమోహన్‌రావు, బాలినేని సత్తిబాబు, బాలినేని నాగేశ్వరరావు, తోట మల్లేశ్వరరావు, సాధం రామకృష్ణ, శ్రీనివాసరావు, కొండలరావు, హర్షవర్ధన్, శ్రీకాంత్, రమేష్, లెనిన్, తోట శ్రీనివాసరావు, శేఖర్, రమేష్, వెంగళరావు, నరసింహారావు, రామయ్య, లక్ష్మణ్, ప్రవీణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనసమారాధన

సుజాతనగర్: కాపు కార్తీక వన సమారాధన సుజాతనగర్‌లోని వీవీఆర్ మామిడి తోటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్‌రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి కృష్ణ, మార్క్‌ఫెడ్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు రంగాకిరణ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితరులు హాజరయ్యారు. మాట్లాడుతూ.... కాపుల అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్తీక వనసమారాధన పేరిట సమావేశం కావడం, ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలు పంచుకోవడం మంచి పరిణామం అన్నారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చింతలపూడి రాజశేఖర్, పెద్దమళ్ల నరేందర్, కోరబోయిన నాగేశ్వరరావు, కొప్పుల నరసింహా, మామిడాల సాంబశివరావు, చింతలపూడి సాయి, గురజాల సీతయ్య, పూరేటి కోటి, మాచిన శ్రీకాంత్ పూరేటి నరేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వనమా వెంకటేశ్వరరావు

కమ్మ మహాజన సంఘం కమిటీ ఎన్నిక

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో కమ్మ మహాజన సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆ సంఘం నూతన అధ్యక్షుడు ఉప్పుగండ్ల రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన కమ్మ మహాజన సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘాన్ని అభివృద్ధి చేయాలని, పరస్పర సహకారంతో అందరినీ కలుపుకుని ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పుగండ్ల రవీంద్రనాథ్, ఉపాధ్యక్షుడిగా ఆళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కొమ్మినేని రమేష్, కోశాధికారిగా జవ్వాజి వేణు, సహాయ కార్యదర్శిగా గుజ్జర్లపూడి రాంబాబు, ప్రచార కార్యదర్శిగా దుద్దుకూరి సుమంత్, గౌరవ అధ్యక్షుడిగా శాగంటి కృష్ణమూర్తి, సలహాదారుడిగా దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సభ్యులుగా వెంకట సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఉపేందర్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, నర్సింహరావు, రవిలను ఎన్నుకున్నారు.

బాధ్యతలు చేపట్టిన జీఎం కృష్ణయ్య


జీఎంను అభినందిస్తున్న అధికారులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా సింగరేణి జీఎంగా వీసం కృష్ణయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. తన చాంబర్‌లో సతీసమేతంగా వేద పండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పరిపాలనా అంశాలను సమీక్షించారు. మాట్లాడుతూ.. ఇల్లెందు ఏరియాలో 2024–25లో నిర్దేశించిన బొగ్గు లక్ష్యాన్ని అధిగమించేందుకు సమష్టి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం బి.వెంకటేశ్వర్లు, జీఎం ఆఫీస్ అధికారులు, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

జీఎంను కలిసిన అధికారుల సంఘం.. సింగరేణి నూతన జీఎం కృష్ణయ్యను సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం తన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అధికారులు శ్రీనివాస్, పవన్, నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, నర్సింహారావు, కృష్ణమోహన్, గోవిందరావు, మహేష్, అంజిరెడ్డి ఉన్నారు.

యూనియన్ నేతలు..

నూతన జీఎం ఈసం కృష్ణయ్యను ఇల్లెందు ఏరియా ఏఐటీయూసీ ప్రతినిధి బృందం కలిసి అభినందించారు. సారయ్య, నజీర్ అహ్మద్, రాజారాం, కె. వెంకటేశ్వర్లు, సుందర్, లచ్చిరామ్, సర్వర్, వీరన్న, శ్రీనివాస్, దాట్ల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక పారిశుద్ధ్యం


పనులను పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కోరారు. ప్రజాపాలన మొదటి రోజు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ డీవీ మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం బాగుండాలంటే పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలన్నారు. పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇంట్లో చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి వాహనాలకు అందించాలని తెలిపారు. ఇంటి ఆవరణలో చెత్త నిల్వ ఉంటే ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడతారన్నారు. మున్సిపల్ మేనేజర్ అంకుషావలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, రాంనివాస్, బన్సీలాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

టేకులపల్లి: ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 9 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా డీఈఓ ఆదేశాల మేరకు ఆదివారం టేకులపల్లి ఉన్నత పాఠశాలలో మండలంలోని విద్యార్థులకు ప్రజాపాలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టేకులపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.గీత విజేతగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. విద్యాశాఖ అధికారి అజ్మీర జగన్ నాయక్, జీహెచ్ఎస్ హెచ్ఎం మేరుగు శ్రీనివాస్, మంద బాబురావు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా


ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

ఇల్లెందు: ఆశా వర్కర్లు లెప్రసీ సర్వే డ్యూటీ చేసి రెండేళ్లు గడిచినా నాటి డ్యూటీ నిధులు చెల్లించకుండా మళ్లీ డ్యూటీ చేయాలడం విడ్డూరంగా ఉందని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌ఏ నబీ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. మాట్లాడుతూ.. ఆశా వర్కర్లను వివిధ ప్రభుత్వ పథకాలకు పావుగా వాడుకుంటున్నారని తెలిపారు. ఏరియర్స్ చెల్లిస్తేనే విధులకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, ఉమాదేవి, రేణుకా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చండి..


మాట్లాడుతున్న కోరం కనకయ్య

ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గంలో వారం రోజుల పాటు జరగనున్న ప్రజాపాలన ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య, ప్రజాపాలన ఉత్సవాల అబ్జర్వర్, టీపీసీసీ ఇన్‌చార్జ్, గీసుగొండ మాజీ ఎంపీపీ సౌజన్య అన్నారు. ఆదివారం ఇల్లెందులోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అయింది. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రతీ కార్యకర్త రోజుకు గంట సమయం పార్టీ కోసం కేటాయించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, గత పాలకులు అవలంభించిన విధానాలను గ్రామాల్లో ప్రజలతో చర్చ పెట్టాలన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ.2500, పింఛన్ పెంపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు డానియేల్, మాజీ మున్సిపల్ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, సుదర్శన్ కోరీ, జాఫర్ పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలి

జూలూరుపాడు: ఖమ్మం జిల్లా ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డ్‌ను విడదీసి ప్రత్యేక మార్కెట్‌గా ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమ నాయకులు కాకర్ల గ్రామానికి చెందిన రాచబంటి వెంకటనర్సయ్య, అనంతారంకు చెందిన బొర్రా ఉపేందర్‌లకు టీజేఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జూలూరుపాడులో ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల్లో శాశ్వత మార్కెట్‌కు నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులతో రాజకీయం సరికాదు


మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: విద్యార్థుల జీవితాలతో బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ విమర్శించారు. ఆదివారం జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఇటీవల హాస్టల్‌లో జరిగిన ఫుడ్ పాయిజన్ జరగడం దురదృష్టకరమన్నారు. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఎంతో భవిష్యత్ ఉందని, తమ సామాజిక వర్గానికి ఉపయోగపడాల్సింది పోయి స్వార్థంతో డైలీవేస్ వర్కర్లను హాస్టళ్లలో నియమించి ఫుడ్ పాయిజన్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో రూ.కోట్లు దోచుకున్నారని, ప్రజల చేత గెంటివేయడబడిన కేటీఆర్, హరీష్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు అధికారం కోల్పోవడంతో కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అధికారులు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలతోపాటు, వసతి గృహాలను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్ రావు, కొలిపాక వెంకటేశ్వర్లు, ధర్మరాజుల వెంకటనారాయణ, ఎస్‌కే మైబూ, రాంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాలునాయక్‌కు సన్మానం..

పాల్వంచ: కార్మిక శ్రేయస్సు కోసం బాలు నాయక్ కృషి మరువలేనిదని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్ఎండీసీ ప్రాంగణంలో ఎన్ఎండీసీ ఉద్యోగి, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు బాలు నాయక్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జలీల్, మంగీలాల్, డాక్టర్ రమేష్, భరత్ కృష్ణ, సుధీర్, కోటి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక మండలి చైర్మన్‌కు సన్మానం


వెన్నెలను సన్మానిస్తున్న శివకుమార్

కొత్తగూడెంరూరల్: తెలంగాణ సాంస్కృతిక మండలి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన గుమ్మడి వెన్నెల (గద్దర్ కుమార్తె)ను సినీగీత రచయిత గాయకుల, అభ్యుదయ కళా సేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ సన్మానం చేశారు. శనివారం మాదాపూర్‌లోని తెలంగాణ సాంస్కృతిక మండలి కార్యాలయంలో ఆమెకు బొకే ఇచ్చి, శాలువాతో సన్మానం చేశారు. మాట్లాడుతూ.. ప్రజా గాయకుడు గద్దర్ ఆశయ సాధనలో భాగంగా సీఎం రేవంతర్‌రెడ్డి గుమ్మడి వెన్నెలకు సాంస్కృతిక మండలి చైర్మన్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సినీ కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ రామన్న, తాండూర్ ధనరాజ్, సామాజిక దళిత ఉద్యమ నాయకులు కాకెల్లి సైమన్, అభ్యుదయ వాది వరప్రసాద్, శంకర్ తదితరులు ఉన్నారు.

వంట గ్యాస్ భద్రతపై అవగాహన


వంట పోటీల్లో పాల్గొన్న వారితో నిర్వాహకులు, అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ఇళ్లలో ఎల్‌పీజీ గ్యాస్ నిర్వహణ, వంట భద్రత నియమాలపై అందరికీ అవగాహన ఉండాలని జిల్లా సివిల్ సప్లై అధికారి రుక్మిణి తెలిపారు. ఎల్‌పీజీ సేఫ్టీ క్యాంపెయిన్‌లో భాగంగా గ్యాస్ ఏజెన్సీల ఆధ్వర్యంలో ఆదివారం గౌతంపూర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో వంటల పోటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుక్మిణి పాల్గొని మాట్లాడారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు శిక్షణ పొందిన సిబ్బంది చేత ఇంటింటికీ తనిఖీలు నిర్వహించి భద్రతా ప్రమాదాలను వినియోగదారులకు వివరిస్తున్నారని తెలిపారు. ఉచితంగా తనిఖీలు చేస్తూ పాత గ్యాస్ పైపు ప్రామాణికం పరిశీలన చేసి తగ్గింపు ధరతో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా సేల్స్ అధికారి గౌతమ్, వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలకు ఎల్‌పీజీ నిర్వహణ, వంటలో భద్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఎల్‌పీజీ హ్యాండ్లింగ్ పద్ధతులతో మహిళలు వంటలు చేశారు. పోటీలో విజేతలుగా మొదటి స్థానంలో ప్రమేల, రెండో స్థానంలో సుల్తానా, మూడో స్థానంలో కొత్తేశ్వరి నిలువగా వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీల నిర్వహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్లంలో ధాన్యం.. వర్షంతో భయం..

ఇల్లెందురూరల్: ఆరుగాలం శ్రమించి.. పంట పండించి.. కుప్ప నూర్పి.. తీరా విక్రయించే సమయంలో అన్నదాతలను వరణుడు కలవరపాటుకు గురిచేస్తున్నాడు. ప్రస్తుత వానాకాలంలో వాతావరణం వరి పంటకు అనుకూలంగా ఉండటం.. చీడపీడల బెడద కూడా అంతగా లేకపోవడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. పండిన ధాన్యం విక్రయించుకునేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలతోపాటు వ్యాపారులు సైతం తేమశాతం పేచీ పెడుతుండటంతో ఆరబెట్టేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. రాత్రివేళ మంచు కురవడం, పగలు ఉష్ణోగ్రత తక్కువగా నమోదు కావడంతో ధాన్యం ఆరబెట్టుకోవడం రైతులకు శక్తికి మించిన పనిగా మారింది. ఇటువంటి సమయంలో వరణుడు చిరు జల్లుల రూపంలో రైతులను భయాందోళనకు గురిచేస్తున్నాడు. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున చిరుజల్లులు కురవడంతో రైతులు కల్లాలోని ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పలుగా చేసి టార్పాలతో కప్పి భద్రపర్చుకునే పనులలో నిమగ్నమయ్యారు. వరణుడు తేలికపాటి జల్లులతో సరిపెట్టుకుంటేనే, లేదంటే చేతికందన పంట నీళ్లలో పోసినట్లేనని రైతులు ఆందోళనకు చెందుతున్నారు.



ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుతున్న రైతు కుటుంబం, ధాన్యాన్ని కుప్ప చేస్తున్న అన్నదాత